అందుబాటులో జీలుగ విత్తనాలు

తిమ్మాపూర్, మే19: భూమిని సారవంతం చేసే పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, జనుము విత్తనాలు సబ్సిడీపై రైతులకు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి జే సురేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. కావాల్సిన రైతులు నుస్తులాపూర్ సొసైటీలో పట్టాదార్ పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులతో పాటు ఫోన్ నంబర్ ఇవ్వాలని పేర్కొన్నారు. 30కిలోల జీలుగ బస్తాకు రూ.1,116, 40కిలోల జనుము విత్తనాల బస్తాకు రూ.1,448 చెల్లించి పొందవచ్చని తెలిపారు.

అధ్యాపకుడికి అభినందన

హుజూరాబాద్ రూరల్, మే 19: సింగాపూర్‌లోని వీఎస్ఆర్ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు లింగబత్తిని మల్లయ్య హైదరాబాద్‌లోని అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో ఈ నెల 17, 18 తేదీల్లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో పాల్గొని ప్రభుత్వ రంగ సంస్థలతోపాటు, ప్రైవేట్, స్వచ్ఛంద సంస్థలు, ఎన్జీవోలు చేస్తున్న సామాజిక సేవ కార్యక్రమాలపై పరిశోధనాత్మక పత్రాన్ని సమర్పించారు. దేశ విదేశాల నుంచి ప్రొఫెసర్లు పాల్గొన్న ఈ సదస్సుకు ఎంపికై పరిశోధనాత్మక పత్రాన్ని సమర్పించిన అధ్యాపకుడు మల్లయ్యను వీఎస్ఆర్ కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు.

ఇళ్లలోకి డ్రైనేజీ నీళ్లు

వీణవంక, మే 19: మండల కేంద్రంలోని తొమ్మిదో వార్డులో మురుగు కాల్వ అస్తవ్యస్తంగా ఉండడంతో డ్రైనేజీలోని నీళ్లు ఇళ్లలోకి వస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ, మండల కేంద్రంలో ఆరు నెలల క్రితం రోడ్డు విస్తరణలో భాగంగా ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ఉన్న డ్రైనేజీలు తొలగించారని, దీంతో ఇటీవల కురుస్తున్న వర్షానికి వార్డులోని డ్రైనేజీ నుంచి నీళ్లు ఇండ్లలోకి వస్తుండడంతో ఇక్కట్లపాలవుతున్నామని పేర్కొన్నారు. అధికారులు వెంటనే సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మోటం శ్రీనివాస్, ఆర్ శంకర్, రమేశ్, రవి, ముత్తమ్మ, రాయిశెట్టి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను నట్టేట ముంచిన కాంగ్రెస్

హుజూరాబాద్ రూరల్, మే19: రైతులకు మేలు చేస్తామని నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, వారిని నట్టేట ముంచిందని రంగాపూర్ మాజీ సర్పంచ్, బీజేపీ జిల్లా కార్యదర్శి బింగి కరుణాకర్ విమర్శించారు. ఆదివారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ధాన్యం క్వింటాల్‌కు రూ.500 చొప్పున రైతులకు బోనస్ ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు దాని ఊసే ఎత్తడం లేదని దుయ్యబట్టారు. కొనుగోళ్లలో జాప్యం వల్ల కల్లాల వద్దే వడ్లు మొలకెత్తే పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు. అలాగే వానకాలం పంటకు ఎకరానికి రూ.7500 చొప్పున పెట్టుబడి సాయం అందజేయాలని డిమాండ్ చేశారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. Ph: 8977639662 / 8977639663.
NT-327714-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

హరితహారానికి సన్నద్ధం

కాలుష్యాన్ని నివారించడంతో పాటు రాష్ట్రంలో అటవీ విస్తీర్ణాన్ని పెంచేందుకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన హరితహారం కార్యక్రమం పదో విడుత కోసం అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తున్నది. జూన్ 15 అనంతరం దీనిని చేపట్టే అవకాశం ఉండగా, ఇందుకోసం అవసరమైన మొక్కలను ఇప్పటికే గ్రామాల్లోని నర్సరీల్లో సిద్ధం చేయిస్తున్నది. ఇందులో నీడనిచ్చే, పండ్ల మొక్కలు ఉండగా, వాటి సంరక్షణ చర్యలను క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నది.

-కలెక్టరేట్, మే 19

నర్సరీలో పెరుగుతున్న మొక్కలు

జిల్లా వ్యాప్తంగా 313 పంచాయతీల్లో నర్సరీలు ఏర్పాటు చేసి, మొక్కలు పెంచుతున్నారు. 16లక్షల71వేల మొక్కలు కొత్తగా సిద్ధం కాగా, గతేడాది మొక్కలు 16లక్షల 70వేల వరకు ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. మొత్తంగా 33.41లక్షల మొక్కలు సిద్ధంగా ఉండగా, 42.80లక్షల మొక్కలు నాటడమే లక్ష్యంగా నిర్దేశించారు. అయితే, వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో లక్ష్యాన్ని 26లక్షలకు కుదించాలంటూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. నేడో, రేపో కుదించిన లక్ష్యానికనుగుణంగా హరితహారం నిర్వహించేందుకు అనువుగా ఏర్పాట్లు చేయాలనే ఉత్తర్వులు కూడా రానున్నట్లు తెలుస్తున్నది.

శాఖలవారీగా లక్ష్యం..

22 రాష్ట్ర ప్రభుత్వ శాఖల ద్వారా ఈసారి హరితహారం నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమవుతున్నది. అందుకనుగుణంగా ఆయా శాఖలకు లక్ష్యాన్ని కూడా నిర్దేశిస్తూ, ఉన్నతాధికారుల అమోదానికి నివేదికలు పంపినట్లు తెలుస్తున్నది. ఇందులో ప్రధానంగా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ 10.20లక్షలు, పంచాయతీరాజ్ శాఖ 1.50లక్షలు, ఆర్‌డబ్ల్యూఎస్ 25వేలు, వ్యవసాయశాఖ లక్ష, పోలీస్ శాఖ 10వేలు, విద్యాశాఖ 25వేలు, దేవాదాయశాఖ 20వేలు, ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ లక్ష, భూగర్భ గనుల శాఖ 50వేలు, విద్యుత్ శాఖ 25వేలు, రహదారులు భవనాల శాఖ 50వేలు, ఉద్యానవన శాఖ లక్ష, ఎస్ఆర్ఎస్పీ కెనాల్స్, ఇరిగేషన్ ట్యాంక్ బండ్ వద్ద 1.50లక్షలు, పట్టుపరిశ్రమ శాఖ లక్ష, కరీంనగర్ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో 3.5లక్షలు, జమ్మికుంట మున్సిపాలిటీ లక్ష, కొత్తపల్లి మున్సిపాల్టీ 40వేలు, చొప్పదండి మున్సిపాల్టీ 50వేలు, అటవీశాఖ లక్ష మొక్కలు నాటి, సంరక్షించేలా లక్ష్యాన్ని నిర్దేశిస్తూ ప్రతిపాదనలు పంపారు.

తొమ్మిది విడుతల్లో 4.2కోట్ల మొక్కలు

అన్ని ప్రభుత్వ విభాగాల ఆధ్వర్యంలో తొమ్మిది విడుతల్లో జిల్లావ్యాప్తంగా 4.2కోట్ల మొక్కలు నాటారు. వాడిపోయిన వాటి స్థానంలో తిరిగి కొత్తవి నాటి సంరక్షిస్తున్నారు. రహదారులకు ఇరువైపులా, కాల్వల ఒడ్డున, చెరువు గట్లు, కుంట కట్టలు, ప్రభుత్వ భూములు, కార్యాలయాల ఆవరణలో మొక్కలు నాటారు. వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. నిత్యం వాటికి నీళ్లు పట్టేందుకు గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలకు ట్యాంకర్లను కూడా కేసీఆర్ ప్రభుత్వం సమకూర్చింది. ఫలితంగా నేడు అవి ఏపుగా పెరిగి గ్రామాలు, పట్టణాలకు పచ్చదనాన్ని పంచుతూ, వాయు కాలుష్యాన్ని తగ్గిస్తున్నాయి. దీంతో, కేసీఆర్ ప్రభుత్వ స్ఫూర్తితో ఈసారి కూడా హరితహారం కార్యక్రమం ప్రారంభించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తున్నది.

పరిసరాలను బట్టి మొక్కలు

ఈసారి ప్రత్యేకంగా ఎవెన్యూ, కమ్యూనిటీ, ఫార్మల్ ప్లాంటేషన్‌పై దృష్టి సారించనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. భిన్న వాతావరణం నెలకొనడం, ఇప్పటికే ప్రభుత్వ భూముల్లో మొక్కలు పెంచుతుండడం మూలంగా వర్షాధారంగా మొక్కల పెంపకానికి తాత్కాలిక బ్రేక్ వేస్తున్నట్లు అధికార వర్గాల సమాచారం. ఈ నెలాఖరు నుంచి అంచనాలు రూపొందించనున్నట్లు తెలుస్తున్నది. గతంలో మాదిరి ఇష్టారాజ్యంగా మొక్కలు నాటకుండా పరిసరాలను బట్టి మొక్కలు నాటేందుకు ప్రత్యేక కార్యాచరణను జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ రూపొందిస్తున్నది. ప్రధానంగా రహదారులు, విద్యుత్ లైన్ల కింద ఏపుగా ఎదిగే వాటికి బదులు రెయిన్ ట్రీస్, కానుగ, పండ్ల మొక్కలు, గుబురు మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు అధికార యంత్రాంగం స్పష్టం చేస్తున్నది. అలాగే, నర్సరీల్లో పెరుగుతున్న మొక్కలను ఎప్పటికప్పుడు గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు సందర్శిస్తూ, చీడ, పీడల బారి నుంచి కాపాడేందుకు అవసరమైన చర్యలు తీసుకునేలా నర్సరీల నిర్వాహకులకు సూచనలు చేస్తున్నారు.

- పదో విడుత కార్యక్రమానికి ఏర్పాట్లు
- గ్రామాల్లోని నర్సరీల్లో కొనసాగుతున్న మొక్కల పెంపకం
- జిల్లాలో 42.80లక్షలు నాటడం లక్ష్యం
- వాతావరణ పరిస్థితుల దృష్ట్యా సవరణ నివేదికలు
- 26.65 లక్షల మొక్కలు నాటేందుకు ప్రతిపాదనలు

పచ్చదనం పెంచేందుకే హరితహారం

వాతావరణంలో రోజురోజుకూ పెరుగుతున్న వాయు కాలుష్యాన్ని తగ్గించి, పల్లెలు, పట్టణాల్లో పచ్చదనం పెంపొందించేందుకే హరితహారం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నం. తొమ్మిది విడుతల్లో డీఆర్డీవో ఆధ్వర్యంలో 2.5కోట్ల వరకు మొక్కలు నాటి సంరక్షిస్తున్నం. జిల్లాలో ఏడెనిమిదేళ్ల క్రితం నాటిన మొక్కలు నేడు ఏపుగా పెరిగి, బాటసారులకు నిలువ నీడనివ్వడంతో పాటు, కాలుష్యాన్ని కూడా తగ్గిస్తున్నాయి. హరితహారం ప్రారంభమైన అనంతరం అడవుల శాతం కూడా పెరిగింది. అటవీశాతం పెరుగుతున్న కొద్దీ విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. గ్రామాల్లోని నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను ఆగ్రామంలోనే నాటేలా ప్రణాళికలు రూపొందించి, పక్కాగా అమలు చేస్తున్నం. నాటిన మొక్కలను మూడేళ్ల వరకు సంరక్షిస్తున్నం.

-శ్రీధర్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి

ఆంక్షలు లేకుండా ధాన్యం కొనాలి

వీణవంక, మే 19: అకాల వర్షాలకు తడిసిన వరిధాన్యాన్ని ఎలాంటి ఆంక్షలు లేకుండా కొనాలని బీజేపీ మండలాధ్యక్షుడు ఆదిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలో తడిసిన ధాన్యాన్ని నాయకులతో కలిసి పరిశీలించి, అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ధాన్యం పండించిన రైతులకు రూ.500 బోనస్‌తో పాటు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేయకపోతే రైతులను కలుపుకొని రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రఘు, జిల్లా కార్యదర్శి నరసింహారాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు నరేశ్‌గౌడ్, నాయకులు సదానందం, ఎల్లాగౌడ్, తిరుపతిరెడ్డి, పెద్ది మల్లారెడ్డి, రాజబాబు, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల ఉసురు తగులుతుంది

చింతకుంటలో వరిధాన్యాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కొత్తపల్లి, మే 19 : ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల ఉసురు తగిలి గద్దె దిగడం ఖాయమని వైస్ ఎంపీపీ భూక్యా తిరుపతినాయక్ విమర్శించారు. ఆదివారం మండలంలోని అన్ని గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ధాన్యం కొనుగోళ్లలో ఆలస్యానికి కారణాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. వైస్ ఎంపీపీ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రైతులను అరిగోస పెడుతున్నారని దుయ్యబట్టారు. సకాలంలో పంట పొలాలకు నీరు ఇవ్వకపోవడంతో రైతులు పెద్ద ఎత్తున నష్టపోయారని, పండించిన పంటను సైతం కొనుగోలు చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి హామీలన్నింటినీ అమలు చేయకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మైనార్టీ విభాగం మండలాధ్యక్షుడు సయ్యద్ చాంద్ పాషా, గ్రామాధ్యక్షుడు పైడిపాల సతీశ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సోమిరెడ్డి లచ్చిరెడ్డి, బోనాల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే ఉన్నడా.. లేడా?'

తిమ్మాపూర్, మే 19: అకాల వర్షాలతో రైతులు కల్లాల్లో ఇబ్బందులు పడుతుంటే అధికార పార్టీకి చెందిన మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఒక్క రైతునూ కలిసి భరోసా కల్పించలేదని, ఆయన ఉన్నడా.. లేడా..? అని బీజేపీ మండలాధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వరాచారి ధ్వజమెత్తారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రైతులకు భరోసా కల్పించడంలో ప్రభుత్వం, అధికార యంత్రాంగం విఫలమైందన్నారు. ఎమ్మెల్యేకు కల్లాలను పరిశీలించి రైతులకు ధైర్యం చెప్పే సమయం కూడా లేదా అని ప్రశ్నించారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే ఎలాంటి కొర్రీలు లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చింతం శ్రీనివాస్, కిన్నెర అనిల్, కంది రాజేందర్‌రెడ్డి, వేల్పుల రవీందర్ యాదవ్, కొయ్యడ శ్రీనివాస్‌గౌడ్, తొర్తి సంతోష్, పబ్బ తిరుపతి, రామిడి మహేందర్‌రెడ్డి, పోరెడ్డి రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొత్తపల్లి: గురువులతో జడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు



మానకొండూర్ రూరల్: వెల్ది జడ్పీ ఉన్నత పాఠశాలలో..

పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు

కొత్తపల్లి/ మానకొండూర్ రూరల్, మే 19: ఆ మిత్రులు 25 ఏళ్ల తర్వాత ఒక్క చోట చేరారు. బాల్య స్మృతులను నెమరేసుకొని చిన్న పిల్లల్లా సరదాగా గడిపారు. కొత్తపల్లి (హెచ్) జడ్పీ ఉన్నత పాఠశాల (బాలురు) 1998-99 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం వీవీఆర్ గార్డెన్స్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పటి గురువులు ప్రేమ్ కుమార్, కిషన్‌రావు, లక్ష్మణ్, స్వామిరెడ్డి, పీఈటీ మల్లారెడ్డిని ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సుమారు 60 మందికి పైగా పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే మానకొండూర్ మండలం వెల్ది జడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు (1997-98 బ్యాచ్ పదో తరగతి) ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకుంటూ, ఆటపాటలతో సంతోషంగా గడిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఉపాధ్యాయులు రాజిరెడ్డి, శ్రీహరి, హనుమంతరావు, రాజాసింగ్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మంచి సమాజ స్థాపనకు కృషి చేయాలి

మాట్లాడుతున్న జెన్నీ క్రిస్టోఫర్

కమాన్‌చౌరస్తా, మే 19 : ప్రతి ఒక్కరూ మంచి సమాజ స్థాపనకు కృషి చేయాలని బ్రదర్ జెన్నీ క్రిస్టోఫర్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో స్థానిక సీఎస్ఐ సంఘాల ఆధ్వర్యంలో సెయింట్ మార్క్ చర్చి గ్రౌండ్‌లో జరుగుతున్న క్రైస్తవ ఉజ్జీవ మహాసభల ముగింపు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శాంతి సామరస్యంతో మెలగి మంచి సమాజ స్థాపనకు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రిసిల్ల పరిమళ రూబెన్ మార్క్, పాల్ కొమ్మాలు, డాక్టర్ ఎస్ జాన్, ఆర్ ప్రసాద్, బీ ప్రసాద్, ఏ మధు మోహన్, పింటు, రోజి, రెనాల్డ్, తిమోతి, క్రిస్టోఫర్, ఇండిపెండెంట్ పాస్టర్స్, స్థానిక సంఘాల పెద్దలు పాల్గొన్నారు.

పెన్షనర్లకు నగదు రహిత చికిత్స అందించాలి

కలెక్టరేట్, మే 19 : పెన్షనర్లకు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు అవసరమైన వైద్య సేవలు, అత్యుత్తమమైన హాస్పిటళ్లలో నగదు రహిత చికిత్స ద్వారా అందించాలని తెలంగాణ పెన్షనర్ల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సముద్రాల జనార్దన్‌రావు కోరారు. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు ఆ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం వినతిపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. కార్పొరేట్ సెక్టార్‌లోని పలు ప్రధాన హాస్పిటళ్లలో నగదు రహిత చికిత్సను తిరస్కరిస్తుండగా, అనేకమంది పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఇక్కట్లనెదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధాప్యంలో ఇబ్బందులకు గురిచేస్తే విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తుందని, వెంటనే స్పందించి నగదు రహిత చికిత్స అందించేలా హాస్పిటళ్లను ఆదేశించాలని ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

లయన్స్ క్లబ్ బాధ్యులతో అంతర్జాతీయ డైరెక్టర్ లయన్ ఘట్టమనేని బాబూరావు

'లయన్స్' సేవా కార్యక్రమాలు హర్షణీయం

- ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ ఘట్టమనేని బాబూరావు

విద్యానగర్, మే 19: ప్రపంచంలోనే అతిపెద్ద స్వచ్ఛంద సేవాసంస్థగా 107 ఏండ్లుగా పేరొందిన లయన్స్ ఇంటర్నేషనల్ ద్వారా తెలంగాణ మల్టీపుల్ ప్రాంతంలో విస్తరించిన 8 లయన్ జిల్లాల సౌజన్యంతో దాదాపు 25 వేల మంది నిస్వార్థ సేవాసింహాలు చేపడుతున్న సమాజహిత సేవాకార్యక్రమాలు హర్షణీయమని అంతర్జాతీయ డైరెక్టర్ లయన్ ఘట్టమనేని బాబూరావు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఓ హోటల్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన మల్టీపుల్ కన్వెన్షన్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. లయన్స్ కృషితో రానున్న రోజుల్లో లయన్స్ ఇంటర్నేషనల్ సభ్యత్వం 15 లక్షలు దాటుతుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. మల్టీపుల్ కౌన్సిల్ చైర్మన్ తీగల మోహన్ రావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ప్రధాన వక్తగా హాజరైన పూర్వ అంతర్జాతీయ డైరెక్టర్, గ్యాట్ ఏరియా లీడర్ లయన్ రుమాళ్ల సునీల్ కుమార్ మాట్లాడుతూ, లయన్స్ మారుమూల ప్రాంతాల నిరుపేదల కోసం నిత్యం అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తూ, ఉచిత నేత్ర చికిత్సలు, అవసరమైన ఇతర సేవలు అందించడం అభినందనీయమన్నారు. సమావేశంలో వివిధ జిల్లాల బ్యానర్ ప్రదర్శనలు, పెద్ద ఎత్తున సేవలందించిన లయన్స్‌కు ప్రశంసాపత్రాలు, పిన్స్ అందజేశారు. గతేడాది కాలంలో మరణించిన లయన్స్‌కు లయన్ కొండ వేణుమూర్తి నేతృత్వంలో ఘనంగా నివాళులర్పించారు. నూతనంగా ఎంపికైన డీసీటీ/డీసీఎస్ అధ్యక్ష కార్యదర్శి కోశాధికారులకు నాయకత్వ బాధ్యతల నిర్వహణపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. 320జీ జిల్లా గవర్నర్ లయన్ హనుమాండ్ల రాజిరెడ్డి నాయకత్వంలో అట్టహాసంగా కరీంనగర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చైర్మన్ లయన్ మినేష్ నారాయణ్ టండన్, నిర్వహణ కమిటీ సభ్యులు లయన్ ఎన్‌వీ రావు, లయన్ ఎస్ కోదండ రామ్ , లయన్ ఎం భద్రేశం, మల్టీపుల్ లీడర్స్ లయన్ దీపక్ బట్టాచార్జీ, లయన్ నరేందర్ రెడ్డి, లయన్ మోహన్, ఐపీఎం సీసీ లయన్ విద్యాసాగర్ రెడ్డి, డాక్టర్ గుర్రం శ్రీనివాస రెడ్డి, మల్టీపుల్ కౌన్సిల్ బాధ్యులు, వివిధ జిల్లాల డీజే టీమ్, పీడీజేలు, తెలంగాణ నలుమూలల నుంచి వచ్చిన 1200 మంది డెలిగేట్లు పాల్గొన్నారు.

మిర్యాలకార్ నరేందర్ మృతికి వినోద్ కుమార్ సంతాపం

మిర్యాల్‌కార్ నరేందర్(ఫైల్)

కార్పొరేషన్, మే 19: కరీంనగర్‌లోని కాపువాడకు చెందిన ఆరేకటిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు మిర్యాల్‌కార్ నరేందర్ గుండెపోటుతో మృతి చెందగా, కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ సంతాపం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో నరేందర్ క్రియాశీలక పాత్ర పోషించారని గుర్తు చేసుకున్నారు. నరేందర్ మృతి అతడి కుటుంబానికి, ఆరేకటిక సంఘానికి, బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

విరిగి పడిన వృక్షం.. ట్రాఫిక్‌కు అంతరాయం

చల్మెడ వైద్యశాల వద్ద రోడ్డుపై విరిగి పడిన చెట్టు

కరీంనగర్ రూరల్, మే 19: బొమ్మకల్ గ్రామంలో ఆదివారం ఈదురుగాలులతో కూడిన వర్షానికి చల్మెడ వైద్యశాల వద్ద చెట్టు విరిగి రాజీవ్ రహదారిపై పడడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. గ్రామ పంచాయతీ సిబ్బంది, ఆర్అండ్‌బీ అధికారులు, రాజీవ్ రహదారి నిర్వాహకులు ఎవరూ పట్టించుకోక పోవడంతో రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. వెంటనే రహదారిపై నుంచి చెట్టు తొలగించాలని కోరుతున్నారు.

మెడికవర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

విద్యానగర్, మే 19: కరీంనగర్ మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం నగరపాలక సంస్థ పరిధిలోని తీగలగుట్టపల్లి బృందావన్ కాలనీలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరాన్ని హాస్పిటల్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మెడికవర్ హాస్పిటల్ కార్పొరేట్ సామాజిక బాధ్యతగా వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు ఆరోగ్య రక్షణ కల్పిస్తున్నదన్నారు. వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మెడికవర్ హాస్పిటల్‌లో అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా హాస్పిటల్ ఫిజీషియన్ డాక్టర్ కార్తీక్, డీఎంవో డాక్టర్ కిశోర్ 80 మంది స్థానికులకు వైద్య పరీక్షల నిర్వహించారు. గుండెకు సంబంధించి ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలు చేశారు. కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది చంద్రశేఖర్, నవీన్ పాల్గొన్నారు.

23న ప్రతిభా అవార్డుల ప్రదానోత్సవం

కమాన్‌చౌరస్తా, మే 19 : పదో తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించిన 84 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, 10 జీపీఏ సాధించిన 80 మంది విద్యార్థులకు పీఆర్టీయూ తెలంగాణ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రతిభా అవార్డులను ప్రదానం చేయనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ముస్కు తిరుపతి రెడ్డి, మర్రి జైపాల్ రెడ్డి తెలిపారు. ఈ నెల 23న కరీంనగర్ కలెక్టర్ ఆడిటోరియంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కమలాకర్ రావు, టీచర్స్ ఎమ్మెల్సీ రఘోత్తం రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు మోహన్‌రెడ్డి, రవీందర్ హాజరవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరారు.

పేదలకు అన్నదానం

విద్యానగర్, మే 19:లయన్స్ క్లబ్ కరీంనగర్ గోల్డెన్ శాతవాహన కార్యదర్శి లయన్ మానువాడ శంకర్, వనజ వివాహ వార్షికోత్సవం సందర్భంగా గిఫ్ట్ ఏ స్మైల్ ఫౌండేషన్ సహకారంతో పేద పిల్లలు, వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి శంకర్ మాట్లాడుతూ, క్లబ్ ఆశయాలైన అన్నదానం, పర్యావరణ పరిరక్షణ, క్యాన్సర్ నివారణ, యూత్ ఎంపవర్‌మెంట్, నేత్ర పరిరక్షణ, అవసరార్థులకు సహాయం చేయడం లాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్లబ్ ట్రెజరర్ ననువాల గిరిధర్